


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -351 శనివారం 2 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్



## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా

### ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు

### హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది –2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని **మిగతాది 2లో...**

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు

ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు

ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎంఅంగీకారం

జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్దితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.
**మిగతాది 2లో...**



## భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

### 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు

### హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

**న్యూఢిల్లీ,మే 1( జర్నలిస్ట్ వార్త)**
పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బందించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, **మిగతాది 2లో...**

## నారా లోకేష్ పై పవన్ కల్యాణ్ ప్రశంసలు

### పదో తరగతి ఉత్తీర్ణులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్



**విజయవాడ,మే 1( జర్నలిస్ట్ వార్త)**
ఏపీలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. **మిగతాది 2లో...**

## నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది

దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

డ్రగ్స్ నియంతరణకు మరింత కఠన చర్యలు

డిజిపిగా సివి ఆనంద్ ప్రమాణస్వీకారం

**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ **మిగతాది 2లో...**



## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

### పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు **మిగతాది 2లో...**

## స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు



### ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి పూర్వ వైభవం

### విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం

### కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు

**విజయవాడ,మే 1( జర్నలిస్ట్ వార్త)**రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. **మిగతాది 2లో...**



## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

### ఆగివున్న లారీని వేగంగా ఢీకొన్న కారు

### ఆరుగురు అక్కడిక్కడే మృతి.

### .మరొకరి పరిస్థితి విషయం

### మృతులంతా యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం

**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. 2లో...

## రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది

120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు

మరో రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బిఆర్ఎస్ పార్టీదే

మేడు ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,మే 1( జర్నలిస్ట్ వార్త)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయీల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక **మిగతాది 2లో...**

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్ధత వల్ల ఎస్ఎల్బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం



ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్ధంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

---------------

# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

, ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ -2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ఎ÷-లాన్ -2026ను మంత్రిగారు విడుదల చేశారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ 45 రోజుల్లో రాష్ట్రంలో గ్రామీణ పట్టణప్రాంతాల్లో ఎక్కడకూడా త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా మోటార్లు కాలిపోతే 24 గంటల్లో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని రోజుకు 14 గంటలు ఫిల్లింగ్ చేసి 15వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖలు ముఖ్యంగా పంచాయితీ రాజ్, మున్సిపల్ ,హెల్త్ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పధంతో వ్యవహరించి తక్షణం ఎక్స్ గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నల్గొండ మంచిర్యాల సూర్యాపేట పెద్దపల్లి జగిత్యాల ఖమ్మం వరంగల్ కరీంనగర్ మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఈ జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ఆడుకుంటూ ప్రమాదాలకు గురౌతున్నారని అందువల్ల ఆయా ప్రాంతాలలో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, పోలీస్ , రెవెన్యూ విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులలో ,÷ర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## జూన్2 నాటికి జర్నలిస్టల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసు కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాధమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పధంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

# పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

# నారా లోకేష్ పై పవన్ కల్యాణ్ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణల వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన అన్నారు.

ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం సుమారు 4 శాతం మేర మెరుగుపడిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని కొనియాడారు. మెగా పేరెంట్-టీచర్స్ మీట్, పరీక్షలకు ముందు ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళిక వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని వివరించారు.

ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని పవన్ పేర్కొన్నారు. గత ఏడాది 72.8 శాతంగా ఉన్న ఉత్తీర్ణత, ఈ ఏడాది 78.39 శాతానికి పెరగడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ విజయం వెనుక అవిశ్రాంతంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు

(మొదటి పేజీ తరువాయి)

పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్-మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు.

అనుక్షణం ప్రజల పక్షం | RNI NO: TELTEL/2023/87607 | తెలుగు దిన పత్రిక

# రాజ్యాంగ హక్కుల రక్షణకు యువత నడుం బిగించాలి

**అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా సాగాలి. -కాట్రపల్లిలో అంబేద్కర్ విగ్రహ పనుల పరిశీలన..**

**ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు - దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ**





**కేసముద్రం/మే 1 (జర్నలిస్ట్ వార్త):** సమాజంలో నేటి యువత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యావంతులుగా ఎదిగి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాట్రపల్లి గ్రామంలో విగ్రహ ఏర్పాటు పనుల పురోగతిని చూసి బిర్రు మహేందర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఒక కీలక విన్నపాన్ని ఆయన ముందుంచారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ని ఆహ్వానించాలని కోరారు. దీనిపై మహేందర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని వ్యక్తిగతంగా మంద కృష్ణ దృష్టికి తీసుకువెళ్తానని, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయనను తప్పకుండా తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, విద్యావంతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జ్ఞానమే ఆయుధం కావాలని తెలిపారు.



భావితరాలకు బాబాసాహెబ్ తత్వాన్ని, ఆయన చేసిన అమోఘమైన కృషిని చాటిచెప్పేందుకు ఈ విగ్రహ ఏర్పాటు ఎంతో అవసరం. కేవలం విగ్రహాల ఏర్పాటుతోనే సరిపెట్టకుండా, యువత విద్యావంతులుగా మారి, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవించడమే కాదు, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో దళిత క్రైస్తవులపై జరుగుతున్న వివక్షను బిర్రు మహేందర్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను పాలకులు, కొన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత విద్వేషాలను సృష్టిస్తూ విభజన రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదన్నారు. దళిత క్రైస్తవులకు న్యాయం జరిగే వరకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

జై భీమ్ భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ చేసిన







నినాదాలు గ్రామంలో మారుమోగాయి.

ఈ కార్యక్రమంలో కాట్రపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మహబూబాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు జల్లే యాకయ్య.ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ యువసేన మండల ప్రధాన కార్యదర్శి మరపట్ల ప్రశాంత్ మాదిగ కాట్రపెల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు, ఎమ్మార్పీఎస్ జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, గ్రామ విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేద్దాం.

**-నందగిరి వెంకటేశ్వర్లు పిలుపు.**

**బయ్యారం/,మే 1.(జర్నలిస్ట్ వార్త)** చికాగో అమరవీరుల రక్తంతో ప్రజ్వరిల్లిన పోరాటం నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిఘటన పోరాటం రూపం తీసుకున్నదని ఆ వీరుల వెలుగులో ఉద్యమాన్ని నిర్మించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన వెంకట్రాంపురం దొరన్న స్మారక భవనంపై,ఇర్సులాపురం గ్రామాలలో ఎర్రజెండాలను ఎగరేశారు.ఈ సందర్భంగా నందగిరి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహం అంటున్న భారత దేశ పాలకవర్గాలు రాష్ట్ర




పాలకవర్గం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని అన్నారు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని ఇవి కార్మిక వర్గానికి మరణ శాసనం అని అన్నారు.బ్యాంకింగ్ రంగాన్ని ఎల్ఐసి రంగాన్ని, బిఎస్ఎన్ఎల్ రంగాన్ని అందులో పని చేసే ఉద్యోగులని తీసివేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి చూస్తున్నరన్నారు అన్నారు.పని గంటలు తగ్గించాలని వేతనాలు పెంచాలని కార్మికుల బతుకులకు భరోసా ఇవ్వాలని ప్రతి కార్మికునికి సకల సౌకర్యాలు కల్పించాలని పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.మే డే స్ఫూర్తిగా కార్మిక వర్గం రైతాంగం పోరాటాలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లో ఎర్రజెండా ఎగరేసి చికాగో అమరవీరుల ఔన్నత్యాన్ని చాటారని అన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రుల మురళి,నందగిరి సత్యం,బొల్లం సోమక్క,బండి ప్రభాకర్, పోలేబోయిన సతీష్,దిడ్డి లింగయ్య, కొండ సాయమ్మ,కొక్కు లక్ష్మి,బచ్చలి రత్న,మాలోత్ బిక్షం,అజ్మీర తేజ,భుక్య సేవ్య,బంగారి కృష్ణ,వేణు,బానోతు రాముడు,లక్కం చంద్రావు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు క్రమశిక్షణతో ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు

**-శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య.**

**బయ్యారం/,మే1.(జర్నలిస్ట్ వార్త)** శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్ సీ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు.జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానాలను శ్రీ చైతన్య విద్యార్థులే సొంతం చేసుకుని సత్తా చాటారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు.శ్రీ చైతన్య పాఠశాల నుండి మొత్తం 133 మంది విద్యార్థులు ఎస్ఎస్ సీ పరీక్షకు హాజరు కాగా100 శాతం ఉత్తీర్ణత సాధించారు.127 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు,83 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు,51 మంది విద్యార్థులు 570 పైగా మార్కులు,26 మంది విద్యార్థులు 580 పైగా మార్కులు సాధించారు.బ్రాంచ్ యావరేజ్ 554 మార్కులుగా నమోదైంది.589 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచిన ఉమ్మగాని రిషిత,బొల్లం అక్షయ లను ముఖ్య అతిథి శ్రీవిద్య గారు ఘనంగా సన్మానించారు.అలాగే 570



పైగా మార్కులు సాధించిన 51 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 597 మార్కులతో స్టేట్ ఫస్ట్ ఖమ్మం ఒలంపియాడ్ బ్రాంచ్ విద్యార్థికి రావడం గర్వకారణం.అదే స్ఫూర్తితో మహబూబాబాద్ బ్రాంచ్ విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలు సాధించారు.బ్రాంచ్ యావరేజ్ 554 రావడం శ్రీ చైతన్య పాఠశాల నాణ్యతకు,నమ్మకానికి నిదర్శనం.

చదువు అనేది కేవలం మార్కుల కోసం కాదు. అది మన ఆలోచనా విధానాన్ని మారుస్తుంది, జీవితాన్ని తీర్చిదిద్దుతుంది.క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవడితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు.విలువలతో



కూడిన విద్యను అభ్యసించి దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి. తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచకుండా,వారి అభిరుచికి తగ్గ లక్ష్యాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలనీ సూచించారు.

ఈ కార్యక్రమంలో డీజిఎం చేతన్ మాథుర్, జోనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్స్ షేక్ మదార్, భార్గవి రెడ్డి,శ్రీ చైతన్య కాలేజ్ డీన్ వర్మ, లెక్చరర్లు రాజీవ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో ప్రథమ శ్రేణి న్యాయస్థానం ఏర్పాటుపై హర్షం



**భీమదేవరపల్లి/మే1 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో ప్రథమ శ్రేణి న్యాయస్థానం ఏర్పాటు కోసం ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై భీమదేవరపల్లి ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో వారు సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, న్యాయస్థానం ఏర్పాటు వల్ల నియోజకవర్గంలోని న్యాయవాదులతో పాటు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల స్టాంప్ వెండర్లు మరియు సాధారణ ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కవ్వ లక్ష్మారెడ్డి, జాలి ప్రమోద్ రెడ్డి, ముల్కనూర్ సర్పంచ్, మంగ రామచంద్రం, మాడుగుల కొమురయ్య, కొలుగూరి రాజు, ఊసకోయిల ప్రకాష్, డాక్టర్ ఎదలాపురం తిరుపతి, డ్యాగాల సారయ్య, చెప్యాల ప్రకాష్, రేణిగుంట్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


# గట్లనర్సింగాపూర్‌లో ఘనంగా మేడే వేడుకలు



**భీమదేవరపల్లి/మే1 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవన కార్మికుల (తాపీమేస్త్రీల) సంఘం అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, గ్రామ కూడలిలో జెండా ఆవిష్కరించారు. మేడే సందర్భంగా గ్రామంలో తొలిసారిగా సభ ఏర్పాటు చేసి కార్మికుల ఐక్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉపసర్పంచ్ బోడిగే శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, శ్రమకు తగ్గ ఫలితాన్ని ఆశించడం రాజ్యాంగం కల్పించిన నైతిక హక్కు అని అన్నారు. గ్రామంలో "వెట్టిచాకిరి" అనే పదం వినిపించకూడదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లంపల్లి సుకుమార్, వార్డు సభ్యులు సంగ అయిలయ్య, పెద్దబోయిన రమాదేవి హరికృష్ణ, కాసనగొట్టు సాయిరాం, బొల్లంపల్లి సంజీవయ్య, సీనియర్ తాపీమేస్త్రీ వీరబ్రహ్మచారి, క్యాషియర్ అంబాల బాబు, తాపీమేస్త్రీ సంఘం సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మేడే వేడుకలను విజయవంతం చేశారు.

# నూతన వధూవరులకు రాష్ట్ర నేతల ఆశీస్సులు

**వివాహ వేడుకలో పాల్గొన్న బిర్రు మహేందర్ మాదిగ**



**వర్ధన్నపేట/మే1(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన సందీప్, గూడూరు మండలం రాజన్నపల్లికి చెందిన ప్రీతిల వివాహం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిర్రు మహేందర్ మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు గోలి సుధాకర్ మాదిగకాంగ్రెస్ పార్టీ యువసేన మండల ప్రధాన కార్యదర్శి, వార్డు సభ్యులు మరుపట్ల ప్రశాంత్‌మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగతదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ద

# కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు

**సత్తుపల్లి/మే 1 (జర్నలిస్ట్ వార్త):**



ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో అసోసియేషన్ అధ్యక్షులు రుద్రాక్షల అప్పాచారి జెండా ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ శ్రమను గౌరవిస్తూ కష్టపడి పనిచేసి తమ జీవిత లక్ష్యాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతే సమాజ అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్. శ్రీనివాస చారి, వెంకటాచారి, యోగీశ్వరాచారి, ఎర్రోజు రామకృష్ణ, కోటేశ్వరరావు, మోహనాచారి, కృష్ణప్రసాద్, షేక్ బాబా, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట జిపిలో తాగునీటి సమస్య తీర్చడానికి నూతన బావి తవ్వడానికి స్థల పరిశీలన.

## -సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,మే 1.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజల నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని మరో నూతన బావిని తవ్వించడానికి సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి వీరభద్ర రావు,వార్డు సభ్యులు బొమ్మకంటి రాంబాబు,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కారిబోతుల రామ్మూర్తి,తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు వడ్లమూడి కోటేశ్వర రావు, సిపిఎం గ్రామ కార్యదర్శి బల్లెం ఆనందరావు,పంచాయతీ కార్యదర్శి జక్కి రఘువీర్,బత్తిని సర్వయ్య,పేరెల్లి నరసయ్య,మరికంటి శ్రీను,దార రఘుపతి,చల్లా రాజు,అవిరినేని వెంకటేశ్వరరావు,బుర్ర దుర్గారావు, తిప్పారపు మల్లేష్,దేశిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,మే 1.(జర్నలిస్ట్ వార్త)**
ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ జన్మదిన వేడుకలను బయ్యారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాత గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు పంపిణీ చేశారు.
అనంతరం నాయకులు మాట్లాడుతూ..హరిప్రియ ప్రజల మనిషి అని,నిత్యం ప్రజల మధ్య ఉంటూ,ప్రజల పక్షాన పోరాడుతూ, ప్రజల మన్ననలు పొందుతూ రాబోయే రోజుల్లో ఇల్లందు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తారని అన్నారు. హరిప్రియ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మనసారా ఆకాంక్షింస్తున్నట్లు తెలిపారు.అనంతరం టేకులపల్లిలో హరిప్రియ ఇంటికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,బానోతు మురళీకృష్ణ,బానోతు లక్ష్మణ్ నాయక్, రేపాకుల వెంకన్న,సర్పంచ్ అజ్మీర దేవోజి,అజ్మీరా సునీల్ నాయక్,జరుపల శ్రీను,దాసరి రాము, గంట రాము,రాయల్ రాజేష్,రేఖ యాకన్న,తొట్టి అనిల్,బైగల్ల వీరబాబు, లకావత్ మహేష్,గుగులోతు




శోభన్ నాయక్,శ్రీకాంత్,లక్ పతి,యాకయ్య, కిరణ్,నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మేడే సందర్భంగా తల్లాడలో కార్మికుల ర్యాలీలు




**తల్లాడ/, మే 1మే 1.(జర్నలిస్ట్ వార్త) :** ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా తల్లాడ మండలంలో కార్మికులు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిఐటియు, టీయుసీఐ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి పలు ప్రాంతాల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. అనంతరం రైస్ ఇండస్ట్రీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు సత్తెనపల్లి నరేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపించారు. వందేళ్ల పోరాట ఫలితంగా సాధించిన 8 గంటల పని విధానం, సమ్మె హక్కులు ప్రమాదంలో ఉన్నాయని అన్నారు.1886 చికాగో కార్మికుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పని గంటల పెంపు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలపై పోరాటం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో చిర్రా లింగయ్య, ముచ్చింతల ఎల్లారావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, చల్లా నాగేశ్వరరావు, మేడి బిక్షం, వంగూరి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేడే రోజు పంచాయతీ సిబ్బందికి సన్మానం



**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోమే 1 (జర్నలిస్ట్ వార్త):**
మేడే సందర్భంగా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామ పంచాయతీలో సిబ్బందికి ఘన సన్మానం నిర్వహించారు. సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందికి నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎండ, వాన తేడా లేకుండా ప్రజల సేవలో కృషి చేస్తున్న వారి సేవలు అమూల్యమని కొనియాడారు. మేడే రోజున కార్మికుల శ్రమను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకారపు అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ, వార్డు సభ్యులు ఆకారపు అరుణ్, రాజారపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వేలేరు మండలంలో ఘనంగా మే డే వేడుకలు



**వేలేరు/, మే 1 (జర్నలిస్ట్ వార్త):**ప్రపంచ కార్మికుల దినోత్సవం (మే డే) సందర్భంగా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కర్ణాకర్, హామలి సంఘం అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులే సమాజానికి వెన్నెముకలని, శ్రామికుడు లేనిదే ప్రపంచం నడవదని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేలేరు మండలంలోని కార్మికులకు తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు రమేష్, ప్రభాకర్, సంపత్, సాంబయ్య, భాస్కర్, సాంబరాజు, వీరయ్య, చంద్రయ్య, రాజు, కొమరయ్య, కోటి, కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు

# కార్మిక సేవలకు గుర్తింపుగా నల్ల స్వామికి 'శ్రమ శక్తి అవార్డు'



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 1( జర్నలిస్ట్ వార్త)**
కార్మిక రంగంలో విశిష్ట సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే ప్రతిష్టాత్మక 'శ్రమ శక్తి అవార్డు' ఈ ఏడాది ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన నల్ల స్వామికి లభించింది.హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.మూడు దశాబ్దాలుగా తాపీ మేస్త్రిగా భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న నల్ల స్వామి, తన అనుభవంతో పాటు కార్మిక సంక్షేమానికి కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా కార్మిక సంఘంలో బాధ్యతలు నిర్వహిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు.కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు.

# కార్మిక హక్కులు.. నినాదాల్లోనేనా?

## 140 ఏళ్ల పోరాటానికి ఫలితం ఎక్కడ?

దేశంలో కార్మికుల హక్కుల కోసం సాగుతున్న పోరాటానికి దాదాపు ఒక శతాబ్దం నలభై సంవత్సరాల చరిత్ర ఉంది. ప్రపంచ కార్మిక ఉద్యమాల ప్రభావంతో ప్రారంభమైన ఈ పోరాటం ఎన్నో విజయాలను సాధించినప్పటికీ, నేటి పరిస్థితులు చూస్తే ఇంకా సాధించాల్సినదే ఎక్కువగా మిగిలి ఉందన్న భావన కలుగుతోంది. ప్రతి ఏడాది మే 1న "మేడే" వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ కార్మికుల కష్టాలను గుర్తు చేసుకుంటున్నా, వారి జీవన ప్రమాణాల్లో ఆశించిన మార్పు కనిపించకపోవడం ఆందోళనకరం. ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం పేరుతో పథకాలు ప్రవేశపెడుతున్నా, అవి కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీస వేతనాల అమలు విషయంలోనే పెద్ద లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనేక రంగాల్లో కార్మికులు చట్టపరంగా నిర్ణయించిన కనీస వేతనం కూడా పొందకుండా పనిచేస్తున్నారు. పెరుగుతున్న ధరలతో పోరాడుతూ జీవనం సాగించడం వారికి భారంగా మారింది.ఇక కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ విస్తరణ మరో కీలక సమస్యగా మారింది. శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతూ, తాత్కాలిక నియామకాలు పెరుగుతున్నాయి. దీంతో ఉద్యోగ భద్రత పూర్తిగా క్షీణిస్తోంది. ఎప్పుడైనా పని కోల్పోతామనే భయం కార్మికులను వెంటాడుతోంది. ఇది వారి జీవన స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది.పాత కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త లేబర్ కోడ్స్ అమలు చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. ఈ కోడ్స్ ద్వారా కార్మికుల హక్కులు కుదించబడుతున్నాయని కార్మిక




సంఘాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా పని గంటల పెంపు, ఓవర్‌టైమ్ చెల్లింపులలో అస్పష్టత వంటి అంశాలు కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.పని గంటలు పెరిగినా, అదనపు పని చేసినందుకు సరైన పారితోషికం అందకపోవడం సాధారణంగా మారింది. ఇది కార్మికుల శ్రమను తక్కువ చేసి చూపించే విధానంగా భావిస్తున్నారు. మరోవైపు కార్మిక సంఘాల హక్కులపై పరిమితులు విధించడం వల్ల సంఘటిత పోరాటం బలహీనపడుతోంది. కార్మికుల గొంతుకను అణచివేసే ప్రయత్నాలుగా దీనిని విమర్శిస్తున్నారు.
మహిళా కార్మికుల పరిస్థితి కూడా ఇంకా ఆశాజనకంగా లేదు. సమాన పనికి సమాన వేతనం, భద్రతా హామీలు పూర్తిగా అమలులోకి రాలేదు. పని ప్రదేశాల్లో వేధింపులు, అసురక్షిత వాతావరణం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, వారి హక్కులు మాత్రం ఇంకా పాక్షికంగానే ఉన్నాయి.
నిర్మాణ, వ్యవసాయ రంగాల్లో పనిచేసే అనధికార కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వారికి సరైన గుర్తింపు లేకపోవడం, సామాజిక భద్రత పథకాలు అందకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కూడా సరైన పరిహారం అందకపోవడం గమనార్హం.కార్మికుల ఆరోగ్య భద్రత విషయంలోనూ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రాణాలు కోల్పోయే ఘటనలు జరుగుతున్నా, వాటిపై తగిన చర్యలు తీసుకోవడంలో లోపాలు కనిపిస్తున్నాయి.
పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలు అందరికీ చేరడం లేదు. కొద్దిమందికే పరిమితమవుతున్నాయి. అనధికార రంగంలో పనిచేసే కార్మికులు ఈ సౌకర్యాలకు పూర్తిగా దూరమవుతున్నారు. వృద్ధాప్యంలో కూడా వారికి భరోసా లేకుండా పోతోంది.ధరల పెరుగుదలతో పోలిస్తే వేతనాలు పెరగకపోవడం మరో ప్రధాన సమస్య. రోజువారీ అవసరాలు తీర్చుకోవడమే కష్టమవుతోంది. పిల్లల విద్య, వైద్యం వంటి అవసరాలు కార్మిక కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. జీవన ప్రమాణాలు క్రమంగా దిగజారుతున్నాయి. ఈ పరిస్థితులన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తే, కార్మికుల హక్కుల కోసం పోరాటం ఇంకా కొనసాగాల్సిన అవసరం ఉన్నట్టే స్పష్టమవుతోంది. మేడే రోజున ఇచ్చే హామీలు కేవలం సభలకే పరిమితం కాకుండా, వాస్తవ జీవితాల్లో అమలు కావాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది.
లేకపోతేడమేడే" ఒక చారిత్రక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతుంది.కార్మికుడి జీవితంలో మార్పు మాత్రం కలగదు.



**సీనియర్ జర్నలిస్ట్**
**కొట్టే సుధాకర్ లెనిన్**
**9908401581**

# హామీల అమలు..

## సేవా కార్యక్రమాల్లో ముందున్న సర్పంచ్

### వేసవిలో కూలీలకు మజ్జిగ పంపిణీ



**తల్లాడ, /మే 1( జర్నలిస్ట్ వార్త)**
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, సేవా కార్యక్రమాల్లో ముందుండే సర్పంచ్‌గా కోడూరు ఉమాదేవి వీర కృష్ణ నిలుస్తున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సేవల విషయంలో చొరవ చూపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.మండల పరిధిలోని గొల్లగూడెం కృష్ణాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఉన్న ఆమె, తీవ్ర వేసవి నేపథ్యంలో కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ముందుకు వచ్చారు. వడదెబ్బ నివారణ కోసం సుమారు 200 నుంచి 300 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కూలీలు అనారోగ్యానికి గురికాకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి దిశగా గ్రామాన్ని నడిపిస్తున్న సర్పంచ్‌పై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కోడూరు వీర కృష్ణ, గ్రామ సెక్రటరీ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్మిక పోరాట స్ఫూర్తి చిహ్నమే మేడే

## కేంద్రం కార్మిక హక్కులను హరించేస్తోంది: తక్కళ్లపల్లి



**హనుమకొండ,/బ్యూరో మే 1( జర్నలిస్ట్ వార్త)**
కార్మికుల హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటాల ప్రతీక మేడేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను క్రమంగా బలహీనపరుస్తోందని ఆయన విమర్శించారు.ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా హనుమకొండ మండలంలోని గుండ్లసింగారం, డబ్బాలు, పలువేల్పుల ప్రాంతాల్లో శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. గుండ్లసింగారంలో జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1886లో చికాగోలో కార్మికులు 8 గంటల పని దినం కోసం చేసిన పోరాటం మేడే ఆవిర్భావానికి కారణమైందన్నారు. హేమార్కెట్ ఘటనలో కార్మికులపై జరిగిన కాల్పులు కార్మిక చరిత్రలో విషాద ఘట్టమని గుర్తుచేశారు.
కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించిన చట్టాలను కోడ్‌లుగా మార్చి హక్కులను కుదించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. సమాన వేతనం, సమ్మె హక్కు, సంఘాల ఏర్పాటు వంటి హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సలహాలతో రైతులకు దిశానిర్దేశం

### నారాయణగిరిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 1( జర్నలిస్ట్ వార్త)**
ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. రాజు మాట్లాడుతూ వరిలో వివిధ రకాల ఎంపిక, స్థానిక నేలలకు అనుకూలమైన రకాల సాగుపై వివరించారు. నేల ఆరోగ్యం కాపాడటానికి ఎరువుల సమతుల వినియోగం ఎంతో అవసరమని సూచించారు.అనంతరం డా. ఎన్. రమ్యశ్రీ వివిధ పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనాల పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఆయిల్ పామ్ జిల్లా అధికారి ఎస్. శంకర్ ఆయిల్ పామ్ సాగు, సస్యరక్షణ, చీడపీడల నియంత్రణ, మార్కెటింగ్ అంశాలపై సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి బిందు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు



**తల్లాడ,/ మే 1 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ పట్టణానికి చెందిన సిరిగిరి అంజయ్య, నాగేశ్వరి దంపతుల కుమారుడు గోపి శ్రావణి ల వివాహ వేడుక శుక్రవారం వారి నివాసంలో ఘనంగా జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కేతేపల్లి భాస్కర్ రావు, వైరా ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేమిశెట్టి నాగన్న హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నవ దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు వెంకటేశ్వరరావు, నేరెళ్ల చిన్నస్వామి, వేమిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కష్టమే దేశాభివృద్ధికి పునాది: అడపా అనిల్



**తల్లాడ,/ మే 1 (జర్నలిస్ట్ వార్త):**ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో నిర్వహించిన మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా యువ నాయకుడు అడపా అనీల్ చౌదరి సమస్త శ్రమజీవులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూడ సమాజ అభివృద్ధి, దేశ ప్రగతికి కార్మికుల శ్రమే అసలు బలం అని పేర్కొన్నారు. అహర్నిశలు కష్టపడుతూ సమాజానికి సేవ చేస్తున్న కార్మికుల కృషి వల్లనే మనం సౌకర్యవంతమైన జీవితం గడుపుతున్నామన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, గౌరవం, సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.మరింతగా కార్మికుల ఐక్యత, సమానత్వం, న్యాయం వంటి విలువలను బలపరచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా కార్మికులకు మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేసి వారిపట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలపుట్ట శ్రీదేవి (అధ్యక్షురాలు), కాంగ్రెస్ నాయకుడు గణేషుల రవి, వార్డ్ సభ్యులు, కార్యదర్శి రాంబాబు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## త్రివేణి సత్తుపల్లి బ్రాంచ్ ఘన విజయం

### నేహా టౌన్ ఫస్ట్ 600లో 595 మార్కులు



**సత్తుపల్లి/, మే 1 (జర్నలిస్ట్ వార్త):**
అకాడెమిక్ ఇయర్ 202526లో త్రివేణి సత్తుపల్లి బ్రాంచ్ అద్భుత ఫలితాలతో ప్రత్యేక గుర్తింపు సాధించింది. త్రివేణి విద్యాసంస్థకు చెందిన విద్యార్థిని లక్ష్మిశెట్టి నేహా తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో 600కు గాను 595 మార్కులు సాధించి సత్తుపల్లి పట్టణంలో టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. ఇదే సమయంలో స్కూల్ ఫస్ట్‌ను కూడా కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకుంది.విజయం సందర్భంగా నేహా ఆనందం వ్యక్తం చేస్తూ, దేవుడి ఆశీస్సులు, తల్లిదండ్రుల సహకారం తన విజయానికి ప్రధాన కారణమని పేర్కొంది. ప్రిన్సిపల్ ఎం. సరిత, క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకాడెమిక్ ఇన్‌చార్జ్ పవన్ అందించిన ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయగలిగానని తెలిపింది.త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి నేహాతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. సిఆర్ఓ మురళీకృష్ణ కూడా విద్యార్థుల కృషిని ప్రశంసించారు.
సత్తుపల్లి టౌన్ సీఐ శ్రీ హరి నేహా ప్రతిభను అభినందిస్తూ, త్రివేణి సత్తుపల్లి బ్రాంచ్ సాధిస్తున్న విజయాలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ధర్మసాగర్ మండలంలో ఘనంగా మేడే ఉత్సవాలు

### ఎర్రజెండాలతో మార్మోగిన గ్రామాలు- కార్మికుల ఐక్యతే బలం అంటూ నినాదాలు









**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 1 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. శ్రమజీవుల పోరాట చరిత్రను స్మరించుకుంటూ, కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలనే సందేశంతో ఎర్రజెండాలను ఎగురవేసి నినాదాలతో గ్రామాలు మార్మోగించాయి.సిపిఐ ఆధ్వర్యంలో తాటికాయల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పెసర యాదగిరి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యతే ప్రధాన ఆయుధమని అన్నారు.సాయిపేట గ్రామంలో కనుకొంటి రాజయ్య జెండా ఎగురవేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురం గ్రామంలో పెద్ద పెండ్యాల నారాయణ గిరి, వల్లపు ధర్మారెడ్డి సంయుక్తంగా జెండాను ఆవిష్కరించి శ్రమజీవుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.ధర్మసాగర్ మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకుడు దొంకి రాజయ్య జెండా ఎగురవేసి కార్మికుల హక్కుల పరిరక్షణపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు శ్రమజీవుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ల రూపంలో తీసుకొస్తున్న చట్టాలు కార్మికుల హక్కులను కుదించేలా ఉన్నాయని విమర్శించారు.
వక్తలు ఇంకా మాట్లాడుతూ, మేడే కేవలం ఉత్సవం మాత్రమే కాకుండా కార్మిక వర్గ పోరాటానికి ప్రతీక అని, ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవుల ఐక్యతకు ఇది చిహ్నమని పేర్కొన్నారు. కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు, కనీస వేతనాల పెంపు, భద్రతా హామీలు, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో చిలుక బాబు, సాయిపేట కొమురయ్య, రాధారపు సదయ్య, చంద్రయ్య, లచ్చయ్య, పరమేష్, సుధాకర్, కమలమ్మ, సుగుణ, వెంకటాద్రి, రాములు, లక్ష్మీనారాయణ, వెంకటమల్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలు మొత్తం కార్మిక ఐక్యత నినాదాలతో ఉత్సాహభరితంగా సాగాయి.

## నల్లబెల్లిలో ఎర్రజెండా రెపరెపలు


### ఘనంగా మేడే వేడుకలు



**వర్ధన్నపేట/ మే 1(జర్నలిస్ట్ వార్త);**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లబెల్లి గ్రామంలో శుక్రవారం మేడే వేడుకలు మిన్నంటాయి. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మిక లోకం ఉత్సాహంగా పాల్గొన్నారుఈ సందర్భంగా సంగ్యేం మండల సీపీఐ కార్యదర్శి ఆరేల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు ముఖ్య అతిథిగా హాజరై, ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరంవారు మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు చిందించిన రక్తం వృథా పోలేదని, నేటికీ వారి పోరాట స్ఫూర్తే మనకు మార్గదర్శకమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోస్థానిక ఉప సర్పంచ్ దేవేందర్‌వార్డు సభ్యులు గోలి సుధాకర్ మరిపట్ల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఏఎంసీ చైర్మన్ ఆశీస్సులు

### ఘనంగా మానస-శ్రావణ్ ల వివాహ వేడుక



**పర్వతగిరి/ మే 1(జర్నలిస్ట్ వార్త);**
మండల పరిధిలోని కొంకపాక (శ్రీనగర్) సమీపంలో గల ఎం.ఎస్. కన్వెన్షన్ హాల్ శుక్రవారం ఒక శుభకార్యానికి వేదికైంది. కట్ర్యాల గ్రామానికి చెందిన రాసూరి కళావతి-రాజ్ కుమార్ దంపతుల కుమార్తె చి.ల.సౌ. మానస, చి. శ్రావణ్ ల వివాహ వేడుక అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకకు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను అక్షింతలు వేసి దీవించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. చైర్మన్‌తో పాటు జర్నలిస్టు నాంపల్లి మల్లేశం కూడా హాజరై వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కట్ర్యాల గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.